క్లుప్తంగా

63 మందికి వైద్య పరీక్షలు



ఉదయగిరి రూరల్: మండలంలోని సున్నం వారిచింతలలో 104 వాహన సేవలను శనివారం అందజేశారు. వైద్యాధికారిణి శివకల్పన 63 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



ఆత్మకూరు: పట్టణంలోని 19వ వార్డుకు చెందిన షేక్ గౌస్‌బాషా(66) అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. ఆయన అంత్యక్రియల నిమిత్తం పెద్దకుమార్తెకు సాంబశివ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు రూ.10వేలు నగదు సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాంపల్లి ప్రసాద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కండక్టర్‌కు ప్రశంసాపత్రం



కావలి (జలదంకి) : కావలి ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఏ ధనమ్మకు డిపో మేనేజర్ రాపూరి శ్రీనివాసరావు శనివారం ప్రశంసాపత్రాన్ని అందజేశారు. జనవరి నుంచి జూన్ వరకు అంకితభావంతో విధులు నిర్వహించడంతో పాటు మిగిలిన వారి కంటే సంస్థకు అధికంగా ఆదాయాన్ని తీసుకురావడంతో ప్రశంసాపత్రాన్ని అందజేసి అభినందించారు.

పాఠశాలకు ఫ్యాన్ల వితరణ



కలిగిరి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు బ్యాంక్ ఆఫ్ బరోడా వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని కలిగిరి బ్రాంచ్ మేనేజర్ సురేష్ ఆరు ఫ్యాన్లను శనివారం వితరణ చేశారు. తొలుత బ్రాంచ్ కార్యాలయంలో వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉత్తమ ఖాతాదారులను సత్కరించారు.

వైఎస్సార్‌సీపీ సమావేశం రేపు

దగదర్తి: బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంపై మండల వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశాన్ని దగదర్తిలో సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు వెలినేని మహేష్‌నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ఎమ్మెల్యే, కావలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని చెప్పారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత

జలదంకి: మండలంలోని చింతలపాళేనికి చెందిన అగ్ని ప్రమాద బాధితులకు కాకర్ల చారిటబుల్ ట్రస్టు ద్వారా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శనివారం చేయూతనందించారు. చింతలపాళేనికి చెందిన సత్తెనపల్లి చందు, పొట్లూరు శ్రీనివాసులు ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో గాయపడ్డారు. కావలిలోని ఓ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సురేష్ బాధితులకు రూ. 10వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

జలదంకి: మండలంలోని జమ్మలపాళెంలో పెట్రోల్‌బంకు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలయ్యారు. వివరాలు...కావలి మండలం బుడంగుంటకు చెందిన శెట్టిపల్లి వివేక్, పోతిపోగు మాతయ్య మోటార్‌సైకిల్‌పై జలదంకి వైపునకు వస్తున్నారు. జమ్మలపాళెం పెట్రోల్ బంకు వద్దకు రాగానే పెట్రోల్‌ను పట్టించుకునేందుకు రోడ్డును క్రాస్ చేయబోయారు. ఈ క్రమంలో కావలి నుంచి వింజమూరు వైపు వెళ్తున్న కారును గమనించకుండా ఢీకొట్టారు. దీంతో మోటార్‌సైకిల్‌పై ఉన్న ఇద్దరు గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. కారు డ్రైవర్ వెంకటేశ్వర్లుతో పాటు అందులోని ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. జలదంకి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ తరలింపు



గొల్లపల్లి తిప్పపై గ్రావెల్ తరలింపుతో ఏర్పడిన భారీ గుంత



లేఅవుట్లకు గ్రావెల్‌ను తరలిస్తున్న టిప్పర్లు

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని గొల్లపల్లి తిప్ప నుంచి గ్రావెల్ అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. బైపాస్‌రోడ్డులో నూతనంగా లేఅవుట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ లేఅవుట్లకు సమీపంలోని గొల్లపల్లి తిప్ప నుంచి కొందరు గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్నారు. తిప్పపై ప్రొక్లయినర్‌ను ఏర్పాటు చేసి టిప్పర్ల ద్వారా భారీ ఎత్తున తరలిస్తూ జేబులు నింపుకొంటున్నారు. మరోవైపు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. గ్రావెల్ తరలింపునకు సంబంధించి ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించకుండానే గ్రావెల్‌ను కొల్లగొడుతున్నారు. శుక్రవారం రాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకు లేఅవుట్లకు భారీ ఎత్తున గ్రావెల్‌ను అక్రమంగా తరలించారు. అయినా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సామాన్యులు ఎవరైనా తట్టమట్టి తరలిస్తే వాలిపోయే అధికారులు భారీ ఎత్తున గ్రావెల్‌ను రేయింబవళ్లు తరలిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల అనధికార లేఅవుట్లుగా పేర్కొంటూ మున్సిపల్ పరిధిలో ఐదారేళ్ల క్రితం ఏర్పాటు చేసిన లేఅవుట్లలోని రోడ్లు, డ్రైనేజీలను మున్సిపల్ అధికారులు ధ్వంసం చేశారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న లేఅవుట్లలోని ప్లాట్లకు మట్టి, గ్రావెల్, ఇసుక, తదితరాలను అక్రమంగా తరలించే క్రమంలోనే వాటి అనుమతులను పరిశీలించి అడ్డుకుంటే అనధికార లేఅవుట్లు ఏర్పాటయ్యే అవకాశం ఉండదు. కానీ కొత్తగా అక్రమంగా లేఅవుట్లను ఏర్పాటు చేస్తున్నా, లేఅవుట్లలోని ప్లాట్లకు అక్రమంగా మట్టిని తరలిస్తున్నా అనధికార లేఅవుట్లపై ఉక్కుపాదం మోపుతున్నామని పేర్కొనే అధికారులు మిన్నకుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రావెల్ అక్రమంగా తరలించే, అనధికారికంగా లేఅవుట్లను వేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి



ఉదయగిరిలో మాట్లాడుతున్న రవిచంద్రప్రసాద్

ఆత్మకూరురూరల్: ప్రకృతి వ్యవసాయంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించి సాగువైపు వారిని ప్రోత్సహించాలని ఏపీటీఎస్‌ఎఫ్ డీపీఎం రాజ్‌కుమార్ సూచించారు. స్థానిక మహిళా సమాఖ్య భవన్‌లో ఏపీటీఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై వీఏఏలు, వీహెచ్‌ఏలు, ఏపీటీఎస్‌ఎఫ్ సిబ్బందికి శిక్షణా తరగతులను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులు చేతికందుతాయన్నారు. ఏఓ కిషోర్‌బాబు, మార్కెటింగ్ మరియు సర్టిఫికేషన్ అధికారి కోటేశ్వరరావు,, మాస్టర్ ట్రైనర్ వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: ఉదయగిరి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని వీఏఏ, వీహెచ్‌ఏలు, ఏఈఓలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి మూడ్రోజులుగా స్థానిక రైతుసేవా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు శనివారంతో ముగిశాయి. ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ రవిచంద్రప్రసాద్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రకతి వ్యవసాయాన్ని ప్రోత్సహించి అధిక విస్తీర్ణంలో రైతులు సాగు చేసేలా చూడాలన్నారు. పంటల సాగులో రసాయనిక ఎరువులు, పురుగు మందులు ఎక్కువ మోతాదులో వాడకుండా అవగాహన కల్పించాలన్నారు. కేటాయించిన లక్ష్యాలను సిబ్బంది సాధించాలన్నారు. ఉదయగిరి ఏడీఏ చెన్నారెడ్డి, మాస్టర్ ట్రైనర్ రామ్మోహన్‌రావు, ఏఓలు మదన్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను విరమించాలని విజ్ఞప్తి



మున్సిపల్ కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్

ఆత్మకూరు: ఇంజనీరింగ్ కార్మికుల సమ్మెకు మద్దతుగా మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. శనివారం ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మె చేపడుతున్న మున్సిపల్ కార్మికులతో కమిషనర్ సీ గంగాప్రసాద్ మాట్లాడారు. పట్టణ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సమ్మెను విరమించాలని కోరారు. ఇంజనీరింగ్ కార్మికుల సమ్మెను ప్రభుత్వం పరిశీలిస్తుందని, పట్టణ ప్రజల ఇబ్బందులను అర్థం చేసుకుని పారిశుధ్య కార్మికులు విధుల్లో చేరాలని కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తాము సమ్మె చేపడుతున్నామని, కార్మిక నాయకుల ఆదేశాల మేరకు తాము నడుచుకుంటామని కార్మికులు విన్నవించారు. ఈ కార్యక్రమంలో చంద్రారెడ్డి, కౌన్సిలర్ గౌస్‌భాషా, శివకోటారెడ్డి, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ నాగేంద్ర

వరికుంటపాడు: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఎంపీడీఓ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జీ వెంకటలక్ష్మమ్మ అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై శాఖల వారీగా సమీక్షించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ తాగునీరు, పారిశుధ్యం సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సంబంధిత అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అనంతరం జెడ్పీటీసీ సభ్యుడు రావేల నాగేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. వైస్ ఎంపీపీ దేవనబోయిన మధు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గ్రామసభలు

సీతారామపురం : మండలంలోని 14 పంచాయతీల్లో పీ-4 సర్వేపై గ్రామసభలను సోమవారం నుంచి నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ అప్పాజీ శనివారం తెలిపారు. 21న అయ్యవారిపల్లి, నెమళ్లదిన్నె, జయపురం, పబ్బులేటిపల్లి, చిన్నాగంపల్లి, సింగారెడ్డిపల్లి పంచాయతీల్లో, 22న దేవరాజుసూరాయపల్లి, దేవిశెట్టిపల్లి, దేవమ్మ చెరువు, బసినేనిపల్లి, బాలాయపల్లి, గుండుపల్లి, మారంరెడ్డిపల్లి, సీతారామపురం పంచాయతీల్లో గ్రామసభలను నిర్వహించనున్నట్లు వివరించారు.

హౌసింగ్ కుంభకోణంపై బీజేపీ నేతల ఫిర్యాదు

కావలి (జలదంకి): కావలి పట్టణంలోని హౌసింగ్ గోదాములో ఆరు వేల సిమెంట్ బస్తాలు, 24 టన్నుల స్టీల్ మాయమైన ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు కావలి ఆర్డీఓ వంశీకృష్ణకు శనివారం వినతిపత్రం అందజేశారు. నిల్వలేని 3,400 సిమెంట్ బస్తాలకు ఆన్‌లైన్ ఆమోదం, అసంపూర్ణ గృహాలకు ఫైనల్ బిల్లులు పెట్టడం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. దీనిపై విచారణ చేపట్టి కేసు నమోదు చేయాలని కోరారు. బీజేపీ నేత మిడతల రమేష్, నాయకులు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

కావలి (జలదంకి) : మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని లోక్ అదాలత్ సభ్యుడు ఎం మాలకొండారెడ్డి అన్నారు. పట్టణంలోని వెంగళరావునగర్ గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా శనివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. విశ్రాంత ఏపీజీబీ మేనేజర్ జైపాల్, ప్రిన్సిపల్ శ్యామ్‌సుధాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తలసేమియాపై అవగాహనకు 2కే వాక్



2కే వాక్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

కావలి (జలదంకి) : తలసేమియాపై అవగాహన కల్పించడంతో పాటు బాధితులకు అండగా నిలవడమే లక్ష్యంగా కావలి పట్టణంలో 2కే వాక్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. రెడ్‌క్రాస్ డేకేర్ సెంటర్, రోటరీ క్లబ్, శ్రీలక్ష్మి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, తదితర సంస్థల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విశాఖ ఆర్‌కే బీచ్‌లో శనివారం సాయంత్రం నిర్వహిస్తున్న 3కే, 5కే, 10కే రన్‌లకు సంఘీభావంగా కావలిలోని బీపీఎస్ సెంటర్ నుంచి రెడ్‌క్రాస్ కార్యాలయం వరకు 2కే వాక్‌ను చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని కావలి డీఎస్పీ శ్రీధర్ ప్రారంభించి మాట్లాడారు. జన్యుపరమైన లోపంతో చిన్నారుల్లో తలసేమియా వ్యాధి వస్తుందన్నారు. ఈ వ్యాధిపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు 2కేవాక్‌ను చేపట్టడం అభినందనీయమన్నారు. రెడ్‌క్రాస్ అధ్యక్షుడు డాకారపు రవిప్రకాష్, ఉపాధ్యక్షుడు హరినారపరెడ్డి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్‌పై అవగాహన



విద్యార్థులకు దంత పరీక్షలు చేస్తున్న డాక్టర్ దివ్య

అనుమసముద్రంపేట: మండలంలోని కావలియడవల్లి ఎంపీపీ పాఠశాలలోని విద్యార్థులకు ఫ్లోరోసిస్ వ్యాధిపై జిల్లా ఫ్లోరోసిస్ వైద్యాధికారిణి దివ్య శనివారం అవగాహన కల్పించారు. ఫ్లోరిన్ ఎక్కువగా కలిగిన నీటిని తాగడం వల్ల ఫ్లోరోసిస్ వ్యాధి వస్తుందన్నారు. దీని వల్ల దంతాలు గారపట్టడం, ఎముకలు పటుత్వం కోల్పోవడం, కీళ్ల నొప్పులు, తదితర దుష్ప్రభావాలు కనిపిస్తాయన్నారు. బోర్లలోని నీటికి బదులుగా మినరల్ వాటర్‌ను తాగాలని సూచించారు. అనంతరం 3,4,5 తరగతుల విద్యార్థులకు దంత పరీక్షలు చేసి ఫ్లోరోసిస్‌తో బాధపడుతున్న వారిని గుర్తించారు. తొలుత చిరమన పీహెచ్‌సీని ఆమె సందర్శించారు. ఆమె వెంట చిరమన పీహెచ్‌సీ డాక్టర్ జ్యోతిరాణి, ఎంఎల్‌హెచ్‌పీ పరిమళ, వైద్యసిబ్బంది ఉన్నారు.

ఎస్సీ బాలుర వసతిగృహం తనిఖీ



విద్యార్థులతో ముచ్చటిస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్

కలిగిరి: మండలంలోని సిద్ధనకొండూరులోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఇన్‌చార్జి తహసీల్దార్ ఎం గిరీష్ శనివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతిగృహ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. వసతి గృహ విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. పట్టుదలతో చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలని, సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట వార్డెన్ ఉమాశంకర్ ఉన్నారు.

బోధన నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు

ఉదయగిరి: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బోధన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఎంఈఓ-2 తోట శ్రీనివాసులు సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గడ్డంవారిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన క్లస్టర్ సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. క్లస్టర్ సమావేశాల్లో బోధన పద్ధతులపై విస్తృతంగా చర్చించాలన్నారు. విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీయాలన్నారు. లోకాస్ట్, నోకాస్ట్ బోధన అభ్యసన సామగ్రిని తయారు చేసుకోవాలన్నారు. విద్యార్థులకు సులభరీతిలో విద్యాబోధన చేయాలన్నారు. క్లస్టర్ చైర్మన్ షరీఫ్,మాలకొండయ్య, ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలు నూర్జహాన్, వెంకటేశ్వర్లు, సత్తార్ పాల్గొన్నారు.

భూ ఆక్రమణకు యత్నం

- 12 ఎకరాల అనాధీనంపై అక్రమార్కుల కన్ను
- యంత్రాలతో చదును



అనాధీన భూమిని చదును చేస్తున్న అక్రమార్కులు

వరికుంటపాడు: దామంచర్ల రెవెన్యూ పరిధిలో గల తూర్పుకొండారెడ్డిపల్లిలోని 12 ఎకరాల అనాధీన భూమిపై అక్రమార్కుల కన్నుపడింది. గ్రామానికి చెందిన కొంతమంది అక్రమార్కులు భూ దోపిడీకి యత్నిస్తున్నారు. జేసీబీలు, యంత్రాలతో చెట్లను రెండు రోజులుగా తొలగించి భూమిని చదును చేశారు. ఇరిగేషన్ అధికారుల ద్వారా ఎలాంటి అనుమతుల్లేకుండానే చెరువు మట్టిని ఆ ప్రదేశానికి తరలించి చదును చేస్తున్నారు. గ్రామస్తుల ఫిర్యాదుతో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు అనాధీన భూమి ఆక్రమణలను శనివారం పరిశీలించి పనులను నిలిపేయించారు. దీనిపై వీఆర్వో ఆదినారాయణ మాట్లాడుతూ.. సర్వే నంబర్ 663/ఏలో రెండెకరాల భూమిని గతంలో జయమ్మకు ఖాతా నంబర్ 880పై పట్టా ఇచ్చారని, అయితే అక్కడ కాకుండా సర్వే నంబర్ 661లోని అనాధీన భూమిలో పనులు చేస్తున్నారని తెలిపారు. దీంతో పనులను నిలిపేయించామని వివరించారు.

గృహ నిర్మాణాలను పూర్తి చేయాలి



గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్

సోమశిల: పక్కాగృహాలను పొందిన లబ్ధిదారులు నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ సూచించారు. అనంతసాగరం మండలం కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని వడ్డిపాళెంలో ఎస్సీ, ఎస్టీల గృహ నిర్మాణాలను శనివారం ఆయన పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న గృహాలకు సంబంధించిన లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సాయంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం ఎస్టీలకు రూ.70వేలు, ఎస్సీలకు రూ.50వేలు చొప్పున గృహ నిర్మాణాలకు అదనపు సాయాన్ని అందజేస్తోందని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని గృహ నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీఓ రామచంద్రయ్య, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఆగస్టు 1, 2 తేదీల్లో మెగా జాబ్‌మేళా

సోమశిల(చేజర్ల): రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆత్మకూరులో ఆగస్టు 1,2 తేదీల్లో మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. చేజర్ల మండలం పెరుమాళ్లపాడులోని తన క్యాంపు కార్యాలయంలో మెగా జాబ్‌మేళా నిర్వహణపై ఆర్డీఓ, డీఎస్పీ వేణుగోపాల్, ఇతర అధికారులతో శనివారం ఆయన సమీక్షించారు. జాబ్‌మేళా విజయవంతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం మీడియా సమావేశం నిర్వహించారు. జాబ్‌మేళాకు వివిధ రకాల ప్రైవేట్ కంపెనీలతో పాటు సాఫ్ట్‌వేర్ కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నారని చెప్పారు. సుమారు 300 మందికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు కల్పించేందుకు కంపెనీల ప్రతినిధులు సిద్ధంగా ఉన్నారన్నారు. ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ చదివిన నిరుద్యోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాబ్‌మేళాకు ఆత్మకూరుకు చెందిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జీ సతీష్‌రెడ్డి, మంత్రి పొంగూరు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు.

కిలో పొగాకు సగటు ధర రూ.192

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శనివారం కిలో పొగాకుకు సగటు ధర రూ.192.86 లభించింది. వేలానికి 858 బేళ్లు రాగా, 622 బేళ్లను విక్రయించారు. కిలో పొగాకు గరిష్ఠంగా రూ.280, కనిష్ఠంగా రూ.159, సగటున రూ.192.86 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు.

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 660 బేళ్లను తీసుకురాగా, 466 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు. కిలో పొగాకు గరిష్ఠంగా రూ.280, కనిష్ఠంగా రూ.160, సగటున రూ.196.55 ధర పలికిందని వివరించారు.

23న మండల సర్వసభ్య సమావేశం

సీతారామపురం : మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 23న ఉదయం 10:30 గంటలకు ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ అప్పాజీ శనివారం తెలిపారు. మండలాధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు



సంగంలో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు



సోమశిల: అనంతసాగరంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



వింజమూరులో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల



ఉదయగిరిలోని వ్యవసాయ కళాశాలలో..

- కావలి డీఎస్పీ శ్రీధర్

కావలి (జలదంకి): ప్లాస్టిక్ వస్తువులు భూమిలో కలిసిపోవడానికి కొన్ని వందల సంవత్సరాలు పడుతుందని, వీటి వాడకం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లడంతో పాటు వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందని కావలి డీఎస్పీ శ్రీధర్ అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా కావలి సబ్‌డివిజన్ పోలీసు అధికారులు, సిబ్బందితో కావలిలోని డీఎస్పీ కార్యాలయం నుంచి ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ వరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం చేపట్టి ప్లాస్టిక్‌ను నిషేధిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వీలైనంతవరకు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని కోరారు.

- కావలి వ్యవసాయ మార్కెట్ కమిటీ, కావలి రైతుబజారు ఆధ్వర్యంలో ప్లాస్టిక్‌తో తలెత్తే అనర్థాలపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్లకు బదులుగా జనపనార, వస్త్రంతో తయారు చేసిన సంచులను వినియోగించాలని కోరారు. కావలి ఏఎంసీ కార్యదర్శి రామాంజనేయులు, రైతు బజార్ ఎస్టేట్ అధికారి మధుబాబు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలన అందరి బాధ్యత

వింజమూరు(ఉదయగిరి): ప్లాస్టిక్ నిర్మూలన అందరి బాధ్యతని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. వింజమూరులో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్థాలను వివరించారు. వింజమూరులో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు నిధులు మంజూరు చేయిస్తామని తెలిపారు. తొలుత జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని పెరటి తోటను పరిశీలించారు.

- ఉదయగిరిలోని మేకపాటి గౌతమ్‌రెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో అసోసియేట్ డీన్ జీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అధ్యాపకులు రఘునాథరెడ్డి, కిషన్ తేజ్, వెంకటేశ్వర్లు, మునీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.
- ఉదయగిరిలో ఎస్సై ఏ శ్రీను, పోలీసు సిబ్బంది ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి రంగనాయకస్వామి ఆలయ సమీపం నుంచి పంచాయతీ బస్టాండ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు.

మర్రిపాడు: మర్రిపాడులో ఎంపీడీఓ నాగేశ్వరప్రసాద్ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆత్మకూరు మార్కెటింగ్ కమిటీ చైర్మన్ ఆరికట్ల జనార్దన్‌నాయుడు పాల్గొని ప్లాస్టిక్‌తో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.

సోమశిల: అనంతసాగరంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి బస్టాండ్ సెంటర్ వరకు విద్యార్థులతో కలిసి అధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్లాస్టిక్‌ను నిషేధిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, డిప్యూటీ ఎంపీడీఓ రామచంద్రయ్య, పీఆర్ ఏఈ శివారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు పాల్గొన్నారు.

సంగం: స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఎస్సై రాజేష్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి పోలీసు సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల్లో ఎంపీడీఓ షాలెట్, తహసీల్దార్ సోమ్లానాయక్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలో ఎస్సై సైదులు ఆధ్వర్యంలో ఠాగూర్ పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏఎస్సై భాస్కర్‌రెడ్డి, ఠాగూర్ పాఠశాల కరెస్పాండెంట్లు దొరస్వామిరెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

సీతారామపురం : స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలోని చెత్త, పిచ్చి మొక్కలను పోలీసు సిబ్బంది తొలగించారు. హెడ్‌కానిస్టేబుల్ యస్దాని, కానిస్టేబుళ్లు ప్రవీణ్, విజయ్, రవి, విజయలక్ష్మి, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.